




జె. వేణిమాధవి
నేచురలిస్ట్

*(గత సంచిక తరువాయి)*

## రాశి వనం

### 8. వృశ్చిక రాశి - నల్లచంద్ర చెట్టు

**(విశాఖ 4; అనూరాధ 1, 2, 3, 4; జ్యేష్ఠ 1, 2, 3, 4 పాదాలు)**

| | |
|---|---|
| శాస్త్రీయ నామం | : **అకేసియా కటేచు** |
| సంస్కృత నామం | : కదిర, దంత దవన, జిహ్వాశల్య, రక్తసర, జీవమాంగల్య, యజ్ఞాంగ, బలపత్ర |
| ప్రాంతీయ నామం | : ఖదిరము, నల్లచంద్ర, పొడలమాను |
| ఆంగ్ల నామం | : కచ్ ట్రీ, బ్లాక్ కచ్. |

**ఔషధ గుణాలు :**

1) ఇది ఆంటి-వైరల్, ఆంటి-ఫంగల్, ఆంటి-బాక్టీరియల్ గుణాలను కలిగివుంది.
2) బొల్లి, కుష్టు వంటి మొండి చర్మ వ్యాధులను నయం చేస్తుంది.
3) పళ్ళు, చిగుళ్ళ వ్యాధులను సమర్థవంతంగా తగ్గిస్తుంది.
4) నోటి ఆరోగ్య సంరక్షణకు ఎంతో ఉపయోగపడుతుంది.
5) ఆస్తమా, ఊపిరితిత్తులకు సంబంధించిన రుగ్మతలను నివారిస్తుంది.









**విశేష గుణాలు :**

1) ఈ చెట్టుని బీహారు, రాజస్థాన్, గుజరాత్ మరియు హిమాచల్ ప్రదేశ్‌లలో వాణిజ్య పంటగా పెంచుతారు.
2) **ఖత్త :** ఖదిరచెట్టు నుంచి ఒక రకమైన తుమ్మ జిగురువంటి పదార్థాన్ని సేకరిస్తారు. దీన్ని తాంబూలం లేదా కిళ్ళీల్లో తప్పని సరిగా వాడతారు. ఇది మన నోటిలోని సున్నితమైన చర్మానికి తమలపాకు, వక్క, సున్నం చేసే హాని నుంచి రక్షణ కల్పిస్తుంది.





2) **ఖచ్చు :** ఇది ఖదిరచెట్టు నుంచి సేకరించే మరొక పదార్థము. దీన్ని చేపల వలలు, తెరచాపలకి వాడతారు. ఇది వాటికి రంగు నివ్వటమే కాకుండా నీటి నుంచి రక్షణ కల్పిస్తుంది. త్వరగా పాడవకుండా కాపాడుతుంది.
3) దీన్నుంచి వచ్చే రంగుని నూలు, సిల్కు, కాటన్ వస్త్రాలకు వాడతారు.





4) ఈ దివ్యవృక్షం శివ పంచాయతన వనంలో వినాయకునికి ప్రతీకగా సూచించబడింది.
5) నక్షత్రవనంలో మృగశిరా నక్షత్రానికి సూచించారు.

## మే 6

## బుద్ధ పూర్ణిమ

**<u>వైశాఖ పూర్ణిమ</u> - బుద్ధుడు**

మన పండుగలు, సంస్కృతీ సాంప్రదాయాల్లో పూర్ణిమ రోజులు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వైశాఖ పూర్ణిమ కూడా ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. గౌతమబుద్ధుడు పుట్టినది, జ్ఞానోదయం పొందింది మరియు మహాపరినిర్యాణము చెందినది అన్నీ ఈ వైశాఖ పూర్ణిమ నాడే కావడం ఎంతో విశేషం. ఇటువంటి సందర్భాలు చాలా అరుదుగా చూస్తాం.

## జ్ఞానోదయం - రావిచెట్టు

బుద్ధుడి చరిత్రలో చూసినట్లయితే ఆయన జ్ఞానోదయం పొందడానికి తన వంతు సహకారాన్నందించిన వృక్షరాజమైన అశ్వత్థము అంటే రావిచెట్టు గురించి తెలియనివారుండరనడం అతిశయోక్తి కాదు. అయితే ఆయన జీవితంతో ఎంతో అవినాభావ సంబంధం కలిగి ఉన్న మరొక దివ్యవృక్షం వుంది. ఇది అంతగా ప్రాచుర్యంలో లేదు. వైశాఖ పూర్ణిమ వలెనే ఈ వృక్షం కూడా బుద్ధుని పుట్టుక, జ్ఞానోదయము మరియు నిర్యాణ సందర్భాల్లో తన సహకారాన్నందించడం చూడవచ్చు. అదే అతి పవిత్రమైన, దివ్యమైన, మహోన్నతమైన 'సాలవృక్షము'

## బుద్ధావతారము - సాల వృక్షము

## పుట్టుక

అది 623 బి.సి. సంవత్సరం. వైశాఖ పౌర్ణమి, బుద్ధుడి తల్లి మహారాణి మాయాదేవి, నిండు గర్భిణిగా ఉన్నప్పుడు, ప్రసవం కొరకు ఆమె తండ్రిగారి రాజ్యానికి బయలుదేరింది. మార్గమధ్యంలో ఆమెకు పురుటినొప్పులు మొదలయ్యాయి. అది హిమాలయ పర్వతాల దగ్గర్లోని లుంబిని వనం, ఇప్పటి నేపాల్ దేశంలో వుంది.





అయితే ఆమె అక్కడ ఉన్న ఒక వృక్షం క్రింద సేదతీరినప్పుడు, ఆ వృక్షం కొమ్మలు క్రిందికి వంగి ఆమెకు అసరాగా నిలిచిన పిదపనే సిద్ధార్థుడిని ప్రసవిస్తుంది. అది దివ్యమైన సాలవృక్షం. విచిత్రంగా, అప్పుడే పుట్టిన బాలుడు అడుగులు వేస్తూ నడవటం మొదలుపెట్టాడు. ప్రతి అడుగు క్రింద ఒక తామరపువ్వు వికసించసాగింది. అలా ఏడు అడుగులు వేసాడు. అక్కడి నుంచి వారు రాజప్రాసాదానికి చేరుకున్నారు. కానీ ఆ మరుసటి వారానికే సిద్ధార్థుడి తల్లి తనువు చాలించింది.

## జ్ఞానోదయము

కాలగమనంలో సిద్ధార్థుడు బోధిచెట్టు (అశ్వత్థము / రావి) క్రింద జ్ఞానోదయమును పొందిన విషయం మనందరికీ తెలుసు. అది ఇప్పటి బీహార్ రాష్ట్రంలోని 'బుద్ధ గయ' ప్రాంతం. అయితే ఆ అశ్వత్థ వృక్షం సాలవనంలో వుండటం విశేషం. అప్పుడు సిద్ధార్థుడికి 35 సంవత్సరాలు. అది కూడా వైశాఖపూర్ణిమ రోజే.





జప తప ధ్యానాదిక్రమాల్లో మనం అంతర్ముఖమై ఉన్నతస్థితులకు చేరుకోవడానికి సున్నిత పరిమళాలు తమ వంతు సహకారాన్నందిస్తాయి. సిద్ధార్థుని విషయంలో ఈ అద్భుతమైన అనుసంధానాన్ని మనం గమనించవచ్చు. సాలవృక్షం గుత్తులు గుత్తులుగా తెల్లని / కోరా రంగు పువ్వులు పూస్తుంది. ఇది అత్యంత పరిమళభరితంగా వుండి దాని సువాసన చాలా దూరం వ్యాపిస్తుంది. దీని బెరడు మరియు కాండం నుంచి సేకరించే సుగంధ ద్రవ్యాలతో అగరుబత్తులు తయారు చేస్తారు. ఇవి బౌద్ధాలయాలలో తప్పనిసరిగా వాడటం ఆచారం. జాలారి పువ్వులు లేదా వాటి నుంచి చేసిన అగరుబత్తులు లేకుండా బౌద్ధాలయాలలో ప్రత్యేకించి ఉత్తర భారతదేశంలో ఏ శుభకార్యమూ జరుగదు.

## నిర్యాణము

బుద్ధుడికి ఎనభై సంవత్సరాల వయస్సులో వైశాఖ పూర్ణిమ రోజే నిర్యాణం చెందడం అత్యంత విశేషం. ఆ రోజు ఆయన సాలవనంలోని రెండు సాలవృక్షాల మధ్య ఉన్న పెద్ద బండమీద శయనించి తనువు చాలించారు. అది ఇప్పటి ఉత్తరప్రదేశ్‌లోని 'కూసీనగర' ప్రదేశం. వెనువెంటనే ఆ రెండు వృక్షాలు విరివిగా పుష్పించి ఆ తథాగతుని









పైన పుష్పవర్షాన్ని కురిపించాయి. బుద్ధుడి విశ్వవ్యాపకత్వాన్ని నిరూపించాయి. ఈ దివ్యవృక్షానికీ బుద్ధుడికి అంత అవినాభావ సంబంధముంది. అంతటి దివ్యత్వం ఆ వృక్షానికి వుంది. ఈ దివ్యవృక్షాన్ని మన ప్రాంతాలలో కూడా అక్కడక్కడా చూడవచ్చు. బెంగుళూరులోని



రేపటి భయాలను గూర్చి ఆలోచిస్తూ కూర్చొంటే, నేటి ఆనందాలు చేజారిపోతాయి.

ఒక బౌద్ధధ్యానాశ్రమంలో ఇది స్వయంగా వెలసి వుండటాన్ని గమనించవచ్చు.

## సాలవృక్షం :

సంస్కృత నామం : సాల వృక్షం

శాస్త్రీయ నామం : **షోరియా రొబస్ట**

ప్రాంతీయ నామం : గుగ్గిలము చెట్టు / జాలరి చెట్టు

## పురాణ ప్రస్తావన :

**సాలానశోకాన్ భవ్యాంశ్చ చంపకాంశ్చ సుపుష్పితాన్**
**ఉద్దాలకాన్నాగవృక్షాన్ చూతాన్ కపిముఖానపి**

*(సుందరకాండ 1:14,3)*

శ్రీమద్రామాయణములోని సుందరకాండలో అశోకవనం యొక్క వర్ణన వుంది. ఆ వనంలో సుమారు నలభైరకాల వృక్షాల ప్రస్తావన





వుంది. దానిలో మొట్టమొదటిది ఈ సాలవృక్షము. ఆ మహాసాధ్వి సీతాదేవికి శోకము లేకుండా సేదతీర్చిన వృక్షాలలో ఇది ఒకటి.

## మానవాళికి వరాలు (వైద్య గుణాలు) :

1) ఇది అల్సర్లు, విరోచనాలను తగ్గిస్తుంది.
2) చెవి సమస్యలు, అధిక ఋతుస్రావం, అధిక బరువును తగ్గిస్తుంది.
3) రక్తహీనతను నివారిస్తుంది.
4) నరాల బలహీనత లేకుండా చేస్తుంది.
5) వీర్య కణాభివృద్ధికి తోడ్పడుతుంది.
6) విరిగిన ఎముకలు జతపర్చటానికి వాడతారు.
7) ఇది బాక్టీరియా కలిగించే వ్యాధులను, దురదలను కూడా సమర్ధవంతంగా తగ్గిస్తుంది.

చోటా నాగ్‌పూర్ ప్రాంతంలోని ప్రజల జీవితాల్లో సాలవృక్షం ఒక గౌరవప్రదమైన స్థానాన్ని సంతరించుకుని వుంది. వారు 'సార్హుల్' అనే ఒక పండుగ జరుపుకుంటారు. ఆ పండుగంతా ఈ వృక్షానికి సంబంధించి వుంటుంది. అది సాలవృక్షం పుష్పించే సందర్భంగా జరుపుకుంటారు.

రామాలయాలు, బౌద్ధారామాల్లో ఈ వృక్షాన్ని నాటడం వల్ల ఆయా దేవతలు మహాత్ముల చైతన్యము ఉనికి ఆ ప్రాంగణాల్లో నిత్యము వుండేదానికి సానుకూలత, యోగ్యత, పవిత్రత ఏర్పడతాయి. మన బాధలు తీరి, కోర్కెలు నెరవేరడానికి అనుకూలిస్తాయి. మరి ఈ దివ్యవృక్షాన్ని చేరదీసి, ఆదరించి ఆరాధిద్దామా!

*సూచన : ఔషధ గుణాలు సూచనమాత్రంగా ప్రస్తావించడం జరిగింది. వైద్యుని సంప్రదించిన పిదపనే వాటిని ఉపయోగించమనవి.* *(సశేషం)*


# శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానము

**ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి)**

## సన్ డైల్ (ఫలభా యంత్రం)



ప్రతిరోజూ ప్రతి పనిలోనూ సమయం ఎంతయిందో తెలుసుకోవడం పరిపాటి. ప్రస్తుతం సమయం తెలుసుకునేందుకు గడియారం, సెల్ ఫోన్లపై ఆధారపడుతున్నారు. సూర్యుడు ఏ దిశలో ఉన్నాడో చూసి దాని ఆధారంగా పూర్వకాలంలో సమయం చెప్పేవారు. కొంతమంది నీడను ఆధారంగానూ చెప్పేవారు. అలా సమయం చెప్పేదాన్ని ఆధారం చేసుకొని రూపొందించినదే **ఫలభా యంత్రం (సన్ డైల్)**. ఈ ఫలభా యంత్రాన్ని శ్రీ పిడపర్తి కృష్ణమూర్తి శాస్త్రిగారి ప్రథమ పుత్రులు శ్రీ పిడపర్తి పూర్ణ సత్యహరిప్రసాద్‌గారు రూపకల్పన చేసి నిర్మించారు. ద్వారకా తిరుమల శేషాచల కొండపై ఈ యంత్రాన్ని నిర్మించారు. గ్రానైట్‌తో ఏర్పాటుచేసిన వేదిక మధ్యగా పెద్దరాయి బిగించి ఉంది. దాని చుట్టూ వలయాకారంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సమయాన్ని సూచించే గంటలు, నిమిషాలు చెక్కి ఉంటాయి. ఈ రాయిపై సూర్యకాంతి పడి దానివెనుక నీడ ఏర్పడుతుంది. నీడపడిన చోట చూస్తే సమయం తెలుస్తుంది. అయితే నీడ చూసిన సమయానికి ఎన్ని నిమిషాలు కలపాలి లేదా తీసివేయాలన్నది ఒక పట్టిక ఆధారంగా తెలుసుకోవాల్సివుంటుంది. సమయాన్ని తెలిపే ఈ ఫలభాయంత్రం రాష్ట్రంలో మొదటిది అన్నవరంలో ఏర్పాటుచేయగా రెండవది ద్వారకాతిరుమలలో నిర్మించారు.




గొప్ప మేధావి నలుగురూ నడిచే దారిలో నడవడు. కొత్త మార్గాలను అన్వేషిస్తాడు.